సాక్షి
వికారాబాద్
గురువారం । 15 । ఆగస్టు । 2024



నిధుల్లేక.. పాలన సాగక!

గ్రామాల్లో పాలన పడకేసింది. నిధుల లేమితో గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కుంటుపడుతోంది. 10లో▸



అనంతగిరి: విద్యుత్ దీపాల అలంకరణలో కలెక్టరేట్

పంద్రాగస్టుకు ముస్తాబు

జిల్లాలో జెండా పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కలెక్టరేట్, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలను అందంగా ముస్తాబు చేశారు. తాండూరు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వంద అడుగుల ఎత్తులో జెండా ఆవిష్కరణ చేయనున్నారు. ఇందుకోసం భారీ స్తంభాన్ని సిద్ధం చేశారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగాకు ప్రజలు సిద్ధమయ్యారు.



కొడంగల్ రూరల్: చిట్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ముస్తాబు చేస్తున్న విద్యార్థులు, సిబ్బంది

న్యూస్‌రీల్

బదిలీల్లో తప్పిదాలను సరిచేయండి

డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి

షాద్‌నగర్‌రూరల్: ఉపాధ్యాయ బదిలీల్లో నెలకొన్న తప్పిదాలను సరి చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. 13 ఏళ్ల తరువాత జరిగిన బదిలీల్లో అన్యాయం జరగడంతో ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారన్నారు. మహిళా ఉపాధ్యాయులను మారుమూల గ్రామాలకు బదిలీ చేయడంతో వారు పాఠశాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. బదిలీల్లో సీనియర్, జూనియర్ ప్రాతిపదికన ఇచ్చిన ఉత్తర్వులను సవరించాలని కోరారు.

నిరుద్యోగులపై ప్రభుత్వ నిర్లక్ష్యం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి



ధర్నాలో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ అమలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. బీజేవైఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం కొంగరకలాన్‌లోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్ శశాంకకు వినతిపత్రం అందజేశారు. ధర్నాకు హాజరైన నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల హామీ మేరకు వెంటనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. నిరుద్యోగుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని ఆరోపించారు. 25వేల పోస్టులతో కూడిన మెగా డీఎస్సీ వేయాలని డిమాండ్ చేశారు. గ్రూప్–2, 3 పోస్టులు పెంచి మరో నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. ఉపాధ్యాయ,ఉద్యోగ నియామకాల్లోనూ ఎన్నో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోసుపల్లి ప్రతాప్, లచ్చిరెడ్డి, దయానంద్‌గౌడ్, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి ప్యాట అశోక్ , లీగల్ సెల్ కన్వీనర్ పగడాల శ్రీశైలం, దిలీప్‌గౌడ్, పాండు, యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్



డంపింగ్ యార్డు వద్ద చెత్త తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ శ్రీనివాస్

శంకర్‌పల్లి: దశల వారీగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. 'సాక్షి' ఆధ్వర్యంలో ఈ నెల 12న చేపట్టిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో కమిషనర్‌కు ప్రజలు పలు సమస్యలను విన్నవించిన విషయం విధితమే. అనంతరం సమస్యల పరిష్కారానికి ఆయన దృష్టి సారించారు. ఇందులో భాగంగా బుధవారం మున్సిపాలిటీలోని 1, 9వ వార్డుల్లో వీధి కుక్కలను బ్లూ క్రాస్ వారికి పట్టించారు. అనంతరం డంపింగ్ యార్డు వద్ద చెత్తను రోడ్డుపై వేయడంతో ఇబ్బందులు తలెత్తినట్లు ఫిర్యాదు రాగా.. జేసీబీ సాయంతో చెత్తను డంపింగ్ యార్డు లోపలికి తరలించారు.


జర్నలిస్టులకు అండగా ఉంటాం

మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



జర్నలిస్ట్ ఆంజనేయులును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

దోమ: ప్రజా సమస్యలను వెలికి తీయడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని, అలాంటి వారికి అన్ని విధాలా అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. దోమ మండలం బాస్‌పల్లికి చెందిన సీనియర్ జర్నలిస్టు ఆంజనేయులు మాతృమూర్తి ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం జర్నలిస్టు కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నాగిరెడ్డి, పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, పార్టీ మండల అధ్యక్షుడు ఆర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



జమ్ము కాశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్న సైనికుడు గొల్ల మల్లేశ్



కార్గిల్ యుద్ధం జరిగిన ప్రాంతంలో తోటి జవాన్లతో సైనికుడు భాస్కర్

జై జవాన్

హస్నాబాద్ గడ్డ.. ఆర్మీకి అడ్డా

దేశసేవ చేసే భాగ్యం అందరికీ లభించడం చాలా అరుదు. ఒకవేళ అవకాశం వచ్చిందంటే తమ జీవితం ధన్యమైనట్లుగా భావిస్తారు. అలాంటిది దుద్యాల్ మండలం హస్నాబాద్‌కు చెందిన వంద మందికి పైగా భారత సైన్యంలో చేరి సేవలందిస్తూ ఉన్నత స్థానాల్లో నిలిచారు. భరత మాతపై తమకున్న ప్రేమను పది మందికి చాటుతున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారత సైన్యంలో సేవలందిస్తున్న హస్నాబాద్ యువతపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

గ్రామం నుంచి వంద మందికి పైగా సైన్యంలో సేవలు

- ఒక్కో కుటుంబం నుంచి ఇద్దరు, ముగ్గురు..
- ప్రతి సెలక్షన్‌లో పక్కాగా ఇద్దరు
- ఇటీవల ఎంపికైన మరో ముగ్గురు
- ఆసక్తి చూపుతున్న యువకులు

దుద్యాల్: హస్నాబాద్‌కు చెందిన వంద మందికి పైగా యువకులు దేశ సేవలో పాల్గొంటున్నారు. సైన్యంలో చేరి ఢిల్లీ, అరుణాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, జమ్మూ కశ్మీర్, తమిళనాడు, మహారాష్ట్ర, కోల్‌కత, రాజస్థాన్, బెంగళూర్ వంటి ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారు. దేశంలోనే కాకుండా విదేశాల్లో సైతం శాంతిభ్రతలను కాపాడుతున్నారు. హస్నాబాద్‌కు చెందిన మతంల మహేశ్ 2010లో సూడాన్ దేశంలో ఆరు నెలల పాటు జవాన్‌గా పని చేశారు. ఇదే గ్రామానికి చెందిన ఇంతియాజ్ అలీ జవాన్‌గా చేరి దళ కమాండ్ స్థాయికి ఎదిగి 1971లో జరిగిన యుద్ధంలో పాల్గొన్నారు. పదవీ విరమణ పొందినా 1982లో జరిగిన కార్గిల్ యుద్ధంలో అనుభజ్ఞులైన దళ కమాండర్లు కావాల్సి రావడంతో కేంద్ర ప్రభుత్వం ఇంతియాజ్ అలీ సేవలను వినియోగించుకుంది. వృత్తిలో కొనసాగుతూనే తోటి సైనికులకు యుద్ధ నైపుణ్యాలను వివరిస్తూ, శిక్షణ ఇచ్చి ప్రభుత్వ మెప్పు పొందారు. గ్రామానికి చెందిన ఎంట్ల కృష్ణ మాజీ రాష్ట్రపతి శంకర్‌దయాల్ శర్మకు గార్డుగా పని చేశారు.

ఒకే కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు..

ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు, ముగ్గురు సైన్యంలో చేరి దేశభక్తిని చాటుకుంటున్నారు. బోయిన వెంటయ్య, బోయిని కృష్ణ, బోయిని సంతోష్ కుమార్‌ది ఒకే కుటుంబం. ముగ్గురూ సైన్యంలో పనిచేశారు. నాయికోటి హన్మంతు, గొల్ల రాములు, గొల్ల ఆశప్ప, బిజ్జారం రాములు, బోయిని శ్రీనివాస్, బొంగు వెంకటేశ్, ముత్యపుగారి పక్కిరప్ప కుటుంబాలకు చెందిన ఇద్దరు చొప్పున సైన్యంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇలా ఒకరిని చూసి మరొకరు సైన్యంలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు.

దేశసేవలోనే ఆనందం

దేశసేవలో ఉన్నంత ఆనందం మరెందులోనూ ఉండదని నిరూపిస్తున్నారు హస్నాబాద్ యువకులు. మిలటరీ వాతావరణం కుటుంబ సభ్యులను కూడా



మరిపింపజేస్తోందని వారు చెబుతున్నారు. ఎప్పుడైన గ్రామానికి వస్తే ప్రజలు ఆదరణ, ఆహ్వానించే విధానం, ఆప్యాయంగా పలకరించడం మనసుకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని చెబుతున్నారు. దేశ రక్షకుడిగా ఉన్నందుకే ఇంతటి అభిమానమని వివరించారు. ఏడాదిలో 90 రోజులు కుటుంబ సభ్యులు, స్నేహితులతో గడపడం, మిగతా రోజుల్లో సైన్యంలోని సహచరులే తమ కుటుంబంగా భావిస్తుంటామని చెప్పుకొచ్చారు.

నోటిఫికేషన్ రావడమే ఆలస్యం

భారత రక్షణ శాఖ సైన్యంలో చేరేందుకు నోటిఫికేషన్ విడుదల చేయడమే ఆలస్యం సెలక్షన్‌కు వెళ్లేందుకు గ్రామం నుంచి దాదాపు 30 మంది యువకులు వివిధ కేటగిరీల్లో పాల్గొంటారు. పాల్గొన్న వారిలో కనీసం ఇద్దరు ఎంపిక అవుతుండడం విశేషం. ఈ ఏడాది ఏకంగా 8 మంది యువకులు సైన్యంలో చేశారు. ఎంపిక కానివారు పట్టు వదలకుండా నిత్యం ప్రాక్టీస్ చేస్తూ మరో నోటిఫికేషన్ వచ్చే వరకు ఎదురు చూస్తారు. చేరిన వారిని స్ఫూర్తిగా తీసుకొని సైన్యంలో చేరేందుకు తీవ్రంగా ప్రయత్నం చేస్తుంటారు. సైన్యంలో చేరాలనే పట్టుదల ప్రతి యువకుడిలో బలంగా ఉందనే చెప్పాలి.



సోల్జర్ గోవర్ధన్ గౌడ్

ఆర్మీలో అగ్గనూరు యువకులు

యాలాల: మండలంలోని అగ్గనూరుకు చెందిన సుమారు 21 మంది ఆర్మీలో చేరి దేశ సేవ చేస్తుండగా, 25 మందికి పైగా పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్నారు. ఆర్మీలో చేరిన సైనికులు దేశ సరిహద్దు, ప్రధాన నగరాల్లో పహారా కాస్తుండగా.. పోలీస్ విభాగంలో చేరిన వారు సమాజ సేవలో తమ వంతు పాలుపంచుకుంటున్నారు. తమ గ్రామానికి చెందిన దాదాపు 50మంది ఆర్మీ, పోలీస్ శాఖల్లో పని చేయడం ఎంతో సంతోషంగా ఉందని అగ్గనూరు ప్రజలు అన్నారు. భవిష్యత్తులో కూడా ఆర్మీలో చేరేందుకు యువతను ప్రోత్సహిస్తామని వారు పేర్కొన్నారు.

క్రమశిక్షణే మిలటరీ సిద్ధాంతం



సైన్యంలో పని చేయడమంటే మొదట్లో భయంగా ఉండేది. కానీ అందులో తెలియని ఆనందం కూడా చాలా ఉంది. ఏ సమయంలో ఎలాంటి పరిస్థితి ఎదురవుతుందో తెలియదు. రానురానూ అక్కడి పరిస్థితులకు అలవాటుపడిపోతాం. మిలటరీ అంటేనే క్రమశిక్షణకు మారుపేరు. శిక్షణ, యుద్ధ సమయాల్లో మన శరీరాన్ని మన ఆధీనంలో ఉంచుకునేలా తయారు చేస్తారు. ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నదే మిలటరీ సిద్ధంతం.

– కోట్ల గోవర్ధన్ గౌడ్, సైనికుడు (జమ్మూ కశ్మీర్), హస్నాబాద్

సోదరభావంతో ఉంటాం



భారత సైన్యంలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఉంటారు. అందరం కలిసి సోదరభావంతో మెలుగుతాం. అదే ఇక్కడి ప్రత్యేకత. దేశ రక్షణలో రాజీ అనేది ఉండదు. కమాండ్ ఆదేశాల మేరకు భారత సరిహద్దులో పహారా కాయాల్సి ఉంటుంది. సైనికుల మధ్య సాధారణ జీవితం మాదిరిగా ఈర్ష్య, ద్వేషాలు ఉండవు. ఒకరిపై ఒకరికి పోటీతత్వం కూడా ఉండదు. ఇక్కడ అందరూ సమానమే.

– కకునూరి అశోక్, సైనికుడు (పంజాబ్‌లో విధులు), హస్నాబాద్



డీకేతండాలో బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న వెటర్నరీ వైద్యురాలు స్వేత

మేకల మృతిపై విచారణ

- వివరాలు సేకరించిన వెటర్నరీ వైద్యురాలు స్వేత
- ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని వెల్లడి

ధారూరు: రైళ్లు ఢీకొని మేకలు మృతిచెందిన ఘటనపై జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి పూర్ణచందర్‌రావు ఆదేశం మేరకు ధారూరు వెటర్నరీ వైద్యురాలు స్వేత బుధవారం విచారణ నిర్వహించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. అనంతరం మండల పరిధిలోని డీకేతండాకు వెళ్లి, బాధితులను కలిసి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. కేతావత్ రమేశ్‌కు చెందిన 20 మేకలు, వి.చంద్రిబాయి 20, పూల్‌సింగ్ 7, కె.బాల్‌రాజ్‌నాయక్ 3, కిష్టిబాయి 15, వి.హస్లీబాయికి చెందిన ఒకటి.. మొత్తం 66 మేకలు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఇందుకు సంబంధించి బాధితులకు రూ.5.50 లక్షల నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. పొదల్లోని అడవి పందులు మేకల మంద వైపు దూసుకురావడంతో.. ఒక్కసారిగా బెదిరిన జీవాలు రైల్వే ట్రాక్‌పైకి చేరాయని బాధితులు తెలిపారు. ఈ సమయంలో డబుల్ రైల్వే లైన్ వద్ద వికారాబాద్, తాండూరు వైపుల నుంచి ఏకకాలంలో వచ్చిన రెండు రైళ్లు మేకలను ఢీకొట్టినట్లు గుర్తించారు. విచారణ నివేదికను జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారికి అందజేయనున్నట్లు తెలిపారు.

ఉపాధి కల్పించాలని ధర్నా

కొత్తూరు: స్థానికులకు ఉపాధి కల్పించాలని కోరుతూ నందిగామ మండలంలోని బండకుంటతండా సమీపంలో ఉన్న ఎంఎస్ఎస్ లాబొరెటరీస్ పరిశ్రమ ఎదుట బుధవారం స్థానికులు ధర్నా చేపట్టారు. వారికి స్థానిక ప్రజాప్రతినిధులు మద్దతు తెలిపారు. అనంతరం ధర్నా చేస్తున్న వారితో ప్రజాప్రతినిధులు చర్చించి పరిశ్రమ ప్రతినిధులకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. దీంతో వారు డిమాండ్లను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని చెప్పడంతో స్థానికులు ధర్నా విరమించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఉపాధి కల్పన అంశంలో పరిశ్రమ నిర్వాహకులు స్థానికులకు సహకరించడం లేదన్నారు. పరిశ్రమలో పనిచేస్తున్న స్థానికులకు వారంలో నాలుగు రోజులు మాత్రమే పని కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా పరిశ్రమ యాజమాన్యం స్పందించి ఉపాధి అంశంలో స్థానికులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇప్పటికే పనిచేస్తూ అన్ని అర్హతలు ఉన్న స్థానిక కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. అంతేకాకుండా పరిశ్రమలో పలు విభాగాల్లో ఉన్న కాంట్రాక్టుల్లో కొన్ని స్థానికులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. సామాజిక సేవలో భాగంగా పరిశ్రమ నిర్వాహకులు బండకుంట తండాకు బస్ సౌకర్యం కల్పించి విద్యార్థులకు సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, కొమ్మకృష్ణ, చంద్రపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మౌలిక వసతులకు మొదటి ప్రాధాన్యత

- కలెక్టర్ ప్రతీక్‌జైన్
- కొడంగల్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం
- పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి

కొడంగల్: జిల్లాలో మౌలిక వసతుల కల్పనకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డితో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చిట్లపల్లి, టేకుల్‌కోడ్, హుస్సేన్‌పూర్ గ్రామాల్లో పంచాయతీ భవనాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఒక్కో భవనాన్ని రూ.20 లక్షలతో నిర్మించినట్లు చెప్పారు. పంచాయతీలు గ్రామాలకు పట్టు కొమ్మలని పేర్కొన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా పంచాయతీల్లో చర్చించుకొని పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం కొడంగల్ మున్సిపల్ పరిధిలోని బాలాజీనగర్ ఉన్నత పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇందుకు రూ.70 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరైనట్లు తెలిపారు. అనంతరం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి అక్కడ జరుగుతున్న అమ్మ ఆదర్శ పనులను పరిశీలించారు. తరగతి పైకప్పు దెబ్బతినడాన్ని పరిశీలించి వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలను అందంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో భారీగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలో కొడంగల్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి సీఎం కృషి చేస్తున్నారని అన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, ఎంపీడీఓ ఉషశ్రీ, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్, జెడ్పీటీసీ మాజీ సభ్యులు ఏన్గుల భాస్కర్, నయీమ్, ఆసీఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలకు పెద్దపీట

బొంరాస్‌పేట: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. బుధవారం మండలంలోని నాందార్‌పూర్, లింగన్‌పల్లిలో నూతనంగా నిర్మించిన జీపీ కార్యాలయాలను ప్రారంభించారు. అనంతరం ఆయా గ్రామాల్లో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నర్సింలు గౌడ్, నాయకులు వెంకట్రాములుగౌడ్, రాజేష్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు అనీఫ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బేగరి రాములు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అనంతగిరి: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ వైద్య సిబ్బందికి సూచించారు. బుధవారం రాష్ట్ర చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి జ్వరాలు, స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంపై కలెక్టర్లతో సమీక్షించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కార్యక్రమాన్ని అధికారులు తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వ్యాధులు ప్రబలే ప్రాంతాల్లో స్పెషల్ క్యాంపులు నిర్వహించాలని ఆదేశించారు. ఇంటింట జ్వర సర్వే చేయాలని సూచించారు. దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ సుధీర్, ట్రయినీ కలెక్టర్ ఉమా హారతి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.



కొడంగల్‌లో దెబ్బతిన్న పాఠశాల పైకప్పును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, తిరుపతిరెడ్డి తదితరులు

డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మారుద్దాం

చేవెళ్ల: రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఎస్పీ, ఐపీఎస్ అధికారి సాయిచైతన్య అన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణపై చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కాలేజీలో బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్స్ వాడకం వల్ల ఎంతో మంది జీవితాలను నష్టపోతున్నారని తెలిపారు. మత్తు, మైకంలో నేరాలకు పాల్పడుతున్నారన్నారు. డ్రగ్స్ అమ్మినా, కొన్నా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నార్కోటిక్ డీఎస్పీ హరిచందర్‌రెడ్డి, సీఐ గోపి శ్రీనివాస్, చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్, రమేశ్‌నాయుడు, ఎస్ఐలు శ్రీకాంత్‌రెడ్డి, మెడికల్ కళాశాల డీన్ సత్యనారాయణ, సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ జోయారాణి, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రావు, ఏఓ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫర్టిలైజర్‌ దుకాణాల్లో తనిఖీలు



స్టాకు వివరాలు నమోదు చేసుకుంటున్న అధికారులు

అనంతగిరి: వికారాబాద్‌ పట్టణంలోని పలు ఫర్టిలైజర్‌ దుకాణాలను ఇన్‌చార్జి ఏడీఏ స్వరూప బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా దుకాణాల్లో ఉన్న స్టాక్‌ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫర్టిలైజర్‌, పురుగుల మందులను పరిశీలించారు. స్టాక్‌ రిజిస్టర్‌ యాథావిధిగా నమోదు చేయాలన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రైతులకు అందుబాటులో సరిపడా యూరియా నిల్వ ఉందన్నారు. పాసు పుస్తకాలు చూసి యూరియా ఇవ్వాలని దుకాణాదారులను ఆదేశించారు. రైతులు కొనుగోలు చేసిన వాటికి రసీదులు తప్పకుండా తీసుకోవాలన్నారు. ఆమె వెంట ఏఓ జ్యోతి తదితరులు ఉన్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దుద్యాల్‌: జెడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు గురువారం జిల్లా కేంద్రంలో అసెంబ్లీ స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌, కలెక్టర్‌ ప్రతీక్‌ జైన్‌, డీఈఓ రేణుకాదేవి చేతుల మీదుగా బహుమతులు అందుకోనున్నట్లు ప్రధానోపాధ్యాయులు విజయరామారావ్‌ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన ఉపన్యాస, చిత్రలేఖనం పోటీల్లో పాఠశాలలో చదువుతున్న అస్మిక(8వ తరగతి), సంగీత(9వ తరగతి) విద్యార్థులు పాల్గొన్నారు. ఇరువురూ ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచారు. దీంతో వారు స్వాతంత్య్ర దినోత్సవం రోజున బహుమతులు అందుకోనున్నట్లు హెచ్‌ఎం తెలిపారు. దీంతో విద్యార్థులకు ఉపాధ్యాయులు రవీందర్‌గౌడ్‌, శ్రీనివాస్‌, ముకుందారెడ్డిలు అభినందించారు.

స్పాట్‌ అడ్మిషన్లు

కుల్కచర్ల: కళాశాలలో మిగిలిపోయిన సీట్లకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని మండలంలోని బండవెల్కిచర్ల గిరిజన గురుకుల ప్రిన్సిపాల్‌ కొండయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో ఇంటర్మీడియట్‌ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ 11, బైపీసీ 22 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. దీనికి గిరిజన విద్యార్థులతో పాటుగా గిరిజనేతరులుసైతం దరఖాస్తు చేసుకొని కళాశాలలో చేరవచ్చన్నారు. ఈ నెల 17 నుంచి 19 వరకు స్పాట్‌ అడ్మిషన్లు నిర్వహిస్తామన్నారు.

నిధుల్లేక.. పాలన సాగక!

గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలని జాతిపిత మహాత్మాగాంధీ అన్నారు. ప్రస్తుతం అలాంటి గ్రామాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నిధుల లేమితో పారిశుద్ధ్య నిర్వహణ గ్రామ పంచాయతీలకు భారంగా తయారైంది.

- డీజిల్‌కు డబ్బులు లేక కదలని ట్రాక్టర్లు
- తమ జేబుల నుంచి పెట్టలేమంటున్న కార్యదర్శులు
- వర్షాకాలంలో గ్రామాల్లో లోపిస్తున్న పారిశుద్ధ్యం



ట్రాక్టర్‌ ద్వారా చెత్త సేకరిస్తున్న పంచాయతీ సిబ్బంది (ఫైల్‌)

దౌల్తాబాద్‌: గ్రామాల్లో పాలన పడకేసింది. నిధుల లేమితో గ్రామ పంచాయతీలు కొట్టుమిట్టాడుతున్నాయి. గ్రామ పాలన సౌలభ్యానికి నెలనెలా విడుదల చేయాల్సిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా నిలుపుదల చేసింది. దీంతో దౌల్తాబాద్‌ మండలంలోని పలు గ్రామ పంచాయతీలు ట్రాక్టర్లకు డీజిల్‌ కూడా సమకూర్చలేని దుస్థితిలో కూరుకుపోయాయి. ఫలితంగా పారిశుద్ధ్య సమస్య విలయ తాండవం చేస్తోంది.

పేరుకుపోతున్న చెత్త

గ్రామ పంచాయతీల్లో నిత్యం ప్రతి ఇంటి నుంచి సిబ్బంది చెత్తను సేకరించి ట్రాక్టర్‌ ద్వారా డంపింగ్‌ యార్డుకు తరలిస్తారు. కానీ 5 నెలలుగా ట్రాక్టర్లలో డీజిల్‌ పోయడానికి కూడా డబ్బులు లేకపోవడంతో గ్రామాల్లో చెత్త సేకరణ నిలిచిపోయిందని పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు. వీధుల్లో చెత్త పేరుకుపోవడంతో దోమలు వృద్ధి చెంది వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మరోవైపు పారిశుద్ధ్య కార్మికులను మూడు నెలలుగా జీతాలు రావడం లేదు.

మరమ్మతులకు అవస్థలు

పంచాయతీ పాలకవర్గాలు గత ఫిబ్రవరితో ముగిశాయి. అప్పటి నుంచి గ్రామాల్లో చెత్త సేకరించే ట్రాక్టర్ల నిర్వహణ అధ్వానంగా మారింది. కనీసం పాత టైర్ల స్థానంలో కొత్త టైర్లు వేసుకోలేని దుస్థితి నెలకొంది. చాలా జీపీల్లో పాత టైర్లతోనే కాలం వెళ్లదీస్తున్నారు. సర్వీసింగ్‌ సైతం చేయకపోవడంతో ట్రాక్టర్లు మధ్యలో మొరాయిస్తున్నాయి. ఈ విషయమై ఎంపీడీఓకు సైతం పంచాయతీ కార్యదర్శులు తమ గోడును వెళ్లబోసుకున్నారు.

కార్యదర్శుల జేబుల నుంచి..

ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి గ్రామ పంచాయతీలకు ఎలాంటి నిధులు మంజూరు కాకపోవడంతో గ్రామ పంచాయతీల్లో చేస్తున్న ఖర్చులన్నీ తామే భరిస్తున్నామని ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు వాపోతున్నారు. గత వేసవిలో బోర్ల మరమత్తులకు, చెత్త ట్రాక్టర్ల డీజిల్‌ కోసం, ఇతర పనుల నిమిత్తం ఒక్కొక్కరు రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు సొంత నిధులు వెచ్చించినట్లు తెలిసింది.

సొంత డబ్బులు వెచ్చించా

వేసవిలో చెరువులో ఉన్న బోరుకు కొత్త మోటారు తీసుకువచ్చి బిగించాం. చెత్త ట్రాక్టర్‌ డీజిల్‌, ఇతర పనులకు సుమారు రూ.లక్షన్నర వరకు ఖర్చు చేశా. దీంతో చాలా ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం స్పందించి పంచాయతీలకు నిధులు విడుదల చేస్తే బాగుంటుంది.

– గోపాల్‌, పంచాయతీ కార్యదర్శి, దౌల్తాబాద్‌

ఉన్నతాధికారులకు నివేదించాం

పంచాయతీలకు నిధుల గురించి ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే తగిన చర్యలు చేపడుతాం. గ్రామాల్లో వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇప్పటి వరకు కార్యదర్శులు అన్ని చర్యలు చేపడుతున్నారు.

– విజయలక్ష్మి, ఎంపీడీఓ, దౌల్తాబాద్‌

అమానుష ఘటనపై విచారణ

- గత నెల 6న మలక్‌పేట్‌లోని హాస్టల్‌లో బాలికపై లైంగిక దాడి
- కేసు వివరాలు సేకరించిన స్త్రీశిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌



బాధితులతో మాట్లాడుతున్న స్త్రీ శిశుసంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్‌ నిర్మలాక్రాంతి వెస్లీ

బొంరాస్‌పేట: ఏడేళ్ల అంధ బాలికపై లైంగిక దాడి జరిగిన ఘటనపై బుధవారం అధికారులు విచారణ నిర్వహించారు. బాధితుల వివరాల మేరకు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన దంపతుల కూతురు ఏడాది వయసులోనే చూపును కోల్పోయింది. దీంతో దివ్యాంగుల సంక్షేమ సంస్థ కమిట్‌మెంట్స్‌ సిబ్బంది ఏడాది క్రితం హైదరాబాద్‌ మలక్‌పేటలోని అంధత్వ వసతి గృహంలో చేర్పించారు. అక్కడ పారిశుద్ధ్య పనులు చేస్తున్న నరేశ్‌ గత నెల 6న బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. విషయం పొక్కకుండా వసతిగృహం వార్డెన్‌ పద్మ జాగ్రత్తలు తీసుకున్నారు. దీనిపై బాధిత తల్లి ఫిర్యాదు చేసింది. వెల్లువెత్తిన నిరసనలతో కేసును స్త్రీ శిశు సంక్షేమాధికారికి అప్పగించారు.

రాష్ట్ర స్థాయి అధికారుల విచారణ

బొంరాస్‌పేటలో ఉన్న బాలికను విచారించేందుకు స్త్రీ శిశుసంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్‌ నిర్మలాక్రాంతి వెస్లీ వచ్చారు. బాలికతో పాటు తల్లిదండ్రులతో మాట్లాడి సంఘటన వివరాలు తెలుసుకుని విచారం వ్యక్తంచేశారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని బాధితులు కోరారు. బాలిక ఆరోగ్య పరిస్థితులకు రూ.25 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో స్త్రీ శిశుసంక్షేమ శాఖ డీడబ్ల్యూఓ అకేశ్వర్‌రావు, డీసీపీఓ శ్రీనివాస్‌, స్వాతి, జీవిత, డీడబ్ల్యూఓ, సీడీపీఓ కృష్ణవేణి, సూపర్‌వైజర్‌ మంజుల, చైల్డ్‌లైన్‌ జిల్లా అధికారి శ్రీకాంత్‌ ఉన్నారు.

సైబర్‌ నేరాలపై అప్రమత్తత

యాలాల ఎస్‌ఐ శంకర్‌

యాలాల: స్మార్ట్‌ ఫోన్‌ల యుగంలో పెరుగుతున్న సైబర్‌ నేరగాళ్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని యాలాల ఎస్‌ఐ శంకర్‌ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని బెన్నూరులో ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. మారుతున్న కాలంతో పాటు నేరాలు, మోసాలు పెరుగుతున్నాయన్నారు. బాల బాలికలు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత స్మార్ట్‌ ఫోన్ల మోజులో పడి క్రీడలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఫోన్‌ యాప్‌లో లోన్‌లు, రీల్స్‌ కోసం ప్రాణాల మీదకి తెచ్చుకోవద్దన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ పటేల్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మయ్య, గురురాజ్‌, పంచాయతీ కార్యదర్శి తారకచారి పాల్గొన్నారు.

హిందువులపై దాడులు అరికట్టాలి



దుద్యాల్‌: ర్యాలీ నిర్వహించిన హిందూవాహిని సభ్యులు, యువకులు

దుద్యాల్‌: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని హిందూవాహిని పిలుపునిచ్చింది. బుధవారం మండలంలోని హస్నాబాద్‌ గ్రామంలో బస్టాండ్‌ చౌరస్తా నుంచి గాంధీ చౌక్‌ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. ఈ సందర్భంగా హిందూవాహిని సభ్యులు మాట్లాడుతూ.. అరాచకాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకొని హిందువులను రక్షించాలని డిమాండ్‌ చేశారు. ఆ విధంగా కేంద్ర ప్రభుత్వం సంప్రదింపులు జరపాలని కోరారు. కార్యక్రమంలో హిందూవాహిని సభ్యులు గోవింద్‌, రాజు, ఆనంద్‌, సురేశ్‌, శ్రీకాంత్‌, చింటు, ఆకాశ్‌, మారుతి, బీరెందర్‌, అంజి, నరేశ్‌, సంపత్‌ గ్రామ యువకులు పాల్గొన్నారు.

బంద్‌ ప్రశాంతం

ధారూరు: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మారణకాండను నిరసిస్తూ బుధవారం హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బీజేపీ, హిందూ సమాజం బంద్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ధారూరులోని హనుమాన్‌ దేవాలయం నుంచి బస్టాండు వరకు ర్యాలీ కొనసాగింది. ప్రపంచ వ్యాప్తంగా హిందువులను కాపాడాలంటూ నినాదాలు చేశారు. హిందువులు శాంతియుతంగా నిర్వహించిన ర్యాలీలో అందరూ స్వచ్ఛందంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎం.రమేశ్‌, నాయకులు పాల్గొన్నారు.

మతోన్మాద శక్తులను శిక్షించాలి

మర్పల్లి: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న హింసను శాంతింప చేసి, మతోన్మాద శక్తులను కఠినంగా శిక్షించాలని హిందూ ఐక్యవేదిక నాయకులు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో బంద్‌ నిర్వహించారు. ముందుగానే స్వచ్ఛందంగా వ్యాపారస్తులు తమ దుకాణాలను మూసి వేశారు. హిందూ ఐక్యవేదిక, బీజేపీ నాయకులు తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట బసవేశ్వర విగ్రహం నుంచి బంగ్లాదేశ్‌లో జరుగుతున్న హింసను ఆపాలంటూ అంబేడ్కర్‌ విగ్రహం వరకు ర్యాలీ తీశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి మల్లేశ్‌ యాదవ్‌, మండల పార్టీ అధ్యక్షుడు రామేశ్వర్‌ రెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌, నాయకులు పాల్గొన్నారు.

పెళ్లి పేరుతో యువకుడి మోసం

- బషీరాబాద్‌ పోలీస్‌ స్టేషన్‌లో బాలిక ఫిర్యాదు
- సహజీవనం చేసిన యువకుడికి జరిమానా
- బాధితురాలికి రూ.1.60 లక్షలు చెల్లించేలా ఇరు కుటుంబాల ఒప్పందం
- వికారాబాద్‌ జిల్లా నీళ్లపల్లిలో ఘటన

బషీరాబాద్‌: బాలిక శీలానికి ఖరీదు కట్టారు. పెళ్లి పేరుతో ఓ యువకుడు తనతో సహజీవనం చేసి చివరకు మోసం చేశాడని 17 ఏళ్ల బాలిక బుధవారం బషీరాబాద్‌ పోలీసులను ఆశ్రయించింది. వివరాల్లోకి వెళితే.. జలాల్‌పూర్‌కు చెందిన యాకూబ్‌(22) పక్క గ్రామానికి చెందిన 16 యేళ్ల విద్యార్థినికి ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పాడు. 2023 ఫిబ్రవరి 14న పెళ్లి చేసుకుంటానని నమ్మించి బైక్‌పై తీసుకెళ్లాడు. అప్పట్లో బాలిక తల్లి బషీరాబాద్‌ పీఎస్‌లో కేసు పెట్టింది. యాకూబ్‌ బాలికతో యాదాద్రి ఆలయ పరిసరాల్లో రెండు నెలలపాటు సహజీవనం చేశారు. అనంతరం బషీరాబాద్‌ పోలీస్‌ స్టేషన్‌కి వచ్చి తాము పెళ్లి చేసుకున్నామని చెప్పారు. బాలికతో వివాహం చెల్లదని పోలీసులు కౌన్సెలింగ్‌ ఇచ్చి పంపారు. అప్పటి నుంచి బాలికతో జలాల్‌పూర్‌లో ఉంటున్నాడు. అయితే బాలికకు 17 ఏళ్లు రావడంతో పెళ్లి చేసుకుందామని చెబితే యాకూబ్‌ ఒప్పుకోలేదని బాలిక తరఫు బంధువులు ఆరోపించారు. మా అమ్మాయికి న్యాయం చేయాలని బుధవారం బషీరాబాద్‌ పోలీసులను ఆశ్రయించారు. మా అమ్మాయి జీవితం నాశనం అయ్యిందని, న్యాయం చేయాలని కోరారు. ఈ క్రమంలో ఇరు కుటుంబాలకు చెందిన వారు, బంధువులు, కొందరు గ్రామస్తులు పీఎస్‌కు చేరుకొని పోలీసుల సమక్షంలో పంచాయితీ పెట్టారు. భవిష్యత్‌లో బాలిక బతుకుదెరువుకు ఇబ్బంది లేకుండా రూ.2 లక్షలు చెల్లించాలని బంధువులు అడగ్గా రూ.1.60 లక్షలు చెల్లించడానికి యువకుడు కుటుంబ సభ్యులు అంగీకరించారు. ప్రస్తుతం రూ.50 చెల్లించి మిగతా డబ్బులు పత్తిపంట చేతికి రాగానే ఇవ్వడానికి ఇరు కుటుంబాలు ఒప్పంద పత్రం రాసుకున్నాయి.

పెళ్లి చేసుకున్నాం

మేము గతేడాది ఫిబ్రవరి 16న యాదగిరి గుట్టలో పెళ్లి చేసుకున్నాం. ఒకే గదిలో ఉన్నాం. అమ్మాయి తల్లి ఉద్దేశపూర్వకంగా కేసు పెట్టారు. పోలీస్‌ స్టేషన్‌లో రాజీ అయ్యాం. అమ్మాయికి రూ.1.60 లక్షలు చెల్లించడానికి ఒప్పంద పత్రం రాసుకున్నాం. నేను అమ్మాయితో కలిసి జీవించడానికి సిద్ధంగా ఉన్నా.

– యాకూబ్‌, యువకుడు

ఇరు కుటుంబాలు రాజీ పడ్డాయి

యాకూబ్‌ అనే యువకుడు తనకు అన్యాయం చేశాడని 17 యేళ్ల బాలిక వారి తల్లి, బంధువులతో బుధవారం పోలీస స్టేషన్‌కి వచ్చారు. 2023 ఫిబ్రవరిలో బాలిక మిస్సింగ్‌ కేసు నమోదయ్యింది. బాలిక జీవితం పాడైతదని ఇరు కుటుంబాలు రాజీ పడుతున్నట్లు రాసి ఇచ్చారు. ఇందులో డబ్బులు మాట్లాడిన విషయం నా దృష్టికి రాలేదు.

– రమేష్‌కుమార్‌, ఎస్‌ఐ

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

- మూడు రోజులుగా వాతావరణంలో మార్పు
- ఒక్కసారిగా పెరిగిన ఉష్ణోగ్రతలు

తాండూరు: ఉక్కపోత ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. మూడు రోజులుగా వాతావరణంలో మార్పు రావడంతో తాండూరు ప్రాంతంలో వేడి అధికమైంది. వారం రోజుల క్రితం వరకు ముసురు వానలతో జనజీవనం స్తంభించింది. సీజనల్‌ వ్యాధులు ప్రబలి ప్రజలు ఆస్పత్రి బాట పట్టారు. ఇదిలా ఉండగా బుధవారం 33 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో ఏసీలు, కూలర్ల వినియోగం పెరిగింది. వాతావరణంలో ఏర్పడిన మార్పుతో పంటలకు నష్టం వాటిల్లే అవకాశం లేకపోలేదు.

రుతుపవనాలు చురుగ్గా కదలక పోవడంతోనే..



రుతుపవనాలు దక్షిణ తెలంగాణలో చురుగ్గా లేకపోవడం వల్లే జిల్లాలో వాతావరణంలో మార్పు కనిపిస్తోంది. ఉష్ణోగ్రతలు పెరగడంతో ఉక్కపోత అధికంగా ఉంటుంది. ప్రస్తుతం ఉత్తర భారత దేశంలో రుతుపవనాలతో వర్షాలు భారీగా కురుస్తున్నాయి. ఈ నెలాఖరు నుంచి సెప్టెంబరు నెలలో భారీగా వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి.

– డాక్టర్‌. సుధాకర్‌చౌరట్‌, ప్రధానశాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధన స్థానం, తాండూరు

అడ్డు లేక.. మందుబాబుల వీరంగం



తరగతి గదిలో మద్యం సీసాలు పగల గొట్టిన మందుబాబులు

- తరగతి గదిలో మద్యం తాగి, బాటిళ్లు పగలగొట్టిన వైనం
- గదులకు తలుపులు లేకపోవడంతో దుశ్చర్య



పాఠశాల సిబ్బంది, గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

దుద్యాల్‌: దేశ భవిష్యత్‌ రూపుదిద్దుకునే తరగతి గదిలో మందుబాబులు వీరంగం సృష్టించారు. ఇష్టం వచ్చినట్లు మద్యం బాటిళ్లను పగలగొట్టి, తరగతి గదిలో పడేసిన సంఘటన మండలంలోని హస్నాబాద్‌ జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం వెలుగు చూసింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింలు తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగానే పాఠశాలకు ఉదయం వచ్చారన్నారు. అప్పటికే తలుపులు లేని తరగతి గదుల్లో దుండగులు మద్యం తాగి బాటిళ్లు పగుల గొట్టారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సైతం కూర్చోడానికి వీలు లేకుండా బెంచీలపై గాజు ముక్కలు పడేశారు. ఇలాంటి దుశ్చర్యలు నిత్యకృత్యమయ్యాయని విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు వాపోయారు. అలాగే పాఠశాలకు ప్రహరీ, తలుపులు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి అక్కడికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసు సిబ్బంది పాఠశాలకు చేరుకుని పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ.. పోలీసులు పెట్రోలింగ్‌ చేసి పాఠశాలలో మద్యం తాగి వారిపై కఠినంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ గ్రామ అధ్యక్షుడు భీములు, గ్రామస్తులు నర్సిములు, రాజు, ఈరప్ప, చిన్న పాల్గొన్నారు.

జాతీయభావాన్ని చాటుకోవాలి



అనంతగిరి: బైక్‌ ర్యాలీలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి తదితరులు



తాండూరు టౌన్‌: నినాదాలు చేస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి

అనంతగిరి/పరిగి: జాతీయభావాన్ని పెంపొందించడమే లక్ష్యంగా దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హర్‌ ఘర్‌ తిరంగా కార్యక్రమాన్ని చేపట్టారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో హర్‌ ఘర్‌ తిరంగా కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగరవేసి జాతీయవాదాన్ని చాటుకోవాలన్నారు. మన దేశాన్ని విశ్వగురువుగా మార్చడమే లక్ష్యంగా ప్రధాని ముందుకు సాగుతున్నారని అందుకు మనమందరం అండగా నిలవాలని సూచించారు. అంతకుముందు వికారాబాద్‌ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు చరణ్‌రెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి, ఉపాధ్యక్షుడు వివేకనందారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్‌ శ్రీధర్‌రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు అమర్‌, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు అనిల్‌యాదవ్‌, నాయకులు వెంకటేష్‌, సాయి చరణ్‌ తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం ఆధ్వర్యంలో బైకు ర్యాలీ

తాండూరు టౌన్‌: హర్‌ ఘర్‌ కా తిరంగా కార్యక్రమంలో భాగంగా తాండూరు పట్టణంలో బీజేవైఎం ఆధ్వర్యంలో బుధవారం బైక్‌ ర్యాలీ నిర్వహించారు. త్రివర్ణ పతాకాలతో పుర వీధుల గుండా ఊరేగారు. ఈ సందర్భంగా పలువురికి జాతీయ జెండాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు లలిత, రజినీకాంత్‌, భద్రేశ్వర్‌, సాహుశ్రీలత, మల్లేశం, కృష్ణ, జహీర్‌అబ్బాస్‌, నరేష్‌, సంజీవ్‌ పాల్గొన్నారు.



తాండూరు టౌన్‌: జాతీయ పతాకాన్ని పంపిణీ చేస్తున్న కౌన్సిలర్‌ సంగీత

కౌన్సిలర్‌ సంగీత ఆధ్వర్యంలో

స్థానిక వార్డు పరిధిలోని ప్రజల వద్దకు వెళ్లి త్రివర్ణ పతాకాలను బీఆర్‌ఎస్‌ కౌన్సిలర్‌ సంగీత పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయులంతా సోదరభావంతో రాజకీయాలకు అతీతంగా కలిసిమెలిసి జీవించాలన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నాగదేవి, టీచర్లు సరిత, జగదీశ్వరి, విద్యార్థులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పంచాయితీకి పిలిపించి.. గొంతు కోసి



బాధితుడు నరేందర్‌

పూడూరు: బావమరిదిని పంచాయితీకి పిలిపించి బావే గొంతు కోసిన సంఘటన చన్గోముల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుసూదన్‌ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కడుమూరు గ్రామానికి చెందిన జొన్నాడ జంగయ్యకు షాబాద్‌ మండలం నాందార్‌ఖాన్‌పేట్‌ గ్రామానికి చెందిన స్వప్నతో ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. గత కొంత కాలంగా కుటుంబ కలహాలు ఉండటంతో తరచూ గొడవ పడేవారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య సయోధ్య కుదుర్చేందుకు జంగయ్య తన మామ బింగి పాపయ్య, బావమరిది బింగి నరేందర్‌, పలువురు గ్రామ పెద్దలను పంచాయితీకి మంగళవారం పిలిపించారు. ఈ క్రమంలో మాటమాట పెరగడంతో జంగయ్య తన బావమరిదిని పదునైన ఆయుధంతో గొంతు కోశాడు. కుటుంబీకులు క్షతగాత్రున్ని ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు బుధవారం బాధితుడి తండ్రి చన్గోముల్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.